ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ భూపాలపల్లి ములుగు 5

గురువారం 5 డిసెంబరు 2024



భూకంపం

భయం భయం



వాజేడు మండలం పేరూరు పీడబ్ల్యూసీ భవనంలో పగుళ్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు సెకన్ల పాటు కంపనాలు

మేడారం కేంద్రంగా వచ్చిందని తెలియడంతో మరింత ఆందోళన

ఇళ్లనుంచి బయటకొచ్చిన జనం

చలి దుప్పటి తొలిగిన సమయం.. ఎవరి పనుల్లోకి వారు వెళ్లేందుకు సిద్ధమవుతున్న వేళ.. హఠాత్తుగా ఏదో అలజడి. ఇళ్లలోని మంచాలు, వస్తువులు కదులుతున్నట్టు అనుభూతి. క్షణాల్లో ఏం జరుగుతుందో తెలియని అయోమయం. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన జనం. ఆ కాసేపటికే కుదురుకున్న పరిస్థితులతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత ములుగు జిల్లా మేడారం కేంద్రంగా భూ కంపం వచ్చిందని తెలుసుకుని మరింత భయభ్రాంతులకు గురయ్యారు. బుధవారం ఉదయం సరిగ్గా 7.27 గంటలకు చోటు చేసుకున్న ఈ ప్రకంపనలు మూడుసెకన్ల పాటు రావడం రిక్టర్‌స్కేల్‌పై 5.3గా నమోదవడం గురించి తెలుసుకుని అంతా ఆందోళన చెందారు. సీసీ కెమెరాల్లో నమోదైన పలు దృశ్యాలు.. ముఖ్యంగా మేడారంలోని సమ్మక్కసారలమ్మ గద్దెల ప్రాంగణం వణికిన తీరు టీవీ చానళ్లు, సోషల్ మీడియాలో రావడం చర్చనీయాంశమైంది. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఈ ప్రకంపనలు రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. దీంతో అప్రమత్తమైన అధికారులు అవగాహన కల్పించి ప్రజలకు ధైర్యం చెప్పారు.

- ఉమ్మడి వరంగల్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి


వివరాలు 7లో



ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో కూలిన ఓ రేకుల ఇంటి ప్రహరీ



భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలో కొద్దిగా ఒరిగిన బాత్రూం



హనుమకొండ ఇందిరానగర్‌లో కూలిన భవనం పోర్టికో

మేడారం మిస్టరీ!

ప్రకృతి వైపరీత్యాలకు కేంద్ర బిందువుగా అభయారణ్యం

కొండాయిపై జంపన్నవాగు ఉప్పెనతో 8మంది బలి

టోర్నడో బీభత్సంతో నేలకూలిన వనం

ఇప్పుడు భూకంపం పుట్టింది ఇక్కడే

భక్తుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన

7

కంపించిన మేడారం గద్దెలు — ఆందోళనకు గురైన భక్తులు, పూజారులు

మేడిగడ్డ అధికారులు అప్రమత్తం — బ్యారేజీ లెవల్స్ పరిశీలన

రామప్పకు ముప్పు వాటిల్లలేదు — ఆర్కియాలజీ డిప్యూటీ సూపరింటెండెంట్ దేశాయి

7

ఏటూరునాగారానికి బస్సు డిపో

బస్సు డిపో మంజూరు చేస్తూ మంత్రి సీతక్కకు పత్రాలను అందజేస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రభాకర్, రవాణా శాఖ ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్





మండల కేంద్రంలో బస్సు డిపోకు కేటాయించిన స్థలంలో ఉన్న బస్టాండ్

- నెరవేరిన ఏజెన్సీ ప్రజల చిరకాల కల
- మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- మంత్రి సీతక్క చొరవతోనే మోక్షం
- వచ్చే బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు సిద్ధం

ఏటూరునాగారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రాంతంలో బస్సు డిపో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ ప్రధాన కార్యదర్శి వికాష్‌రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌ను శాలువాలతో మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏటూరునాగారం మండలం ముల్లెకట్ట గోదావరి నదిపై వంతెన నిర్మాణం పూర్తయి రవాణా సౌకర్యం మెరుగవుతున్న క్రమంలో బస్సు డిపో నిర్మాణానికి ఆర్టీసీ అధికారులు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయినప్పటికీ వివిధ కారణాల వల్ల డిపో ఏర్పాటుకు చర్యలు ముందుకు సాగలేదు. తాజాగా ఏటూరునాగారం ఏజెన్సీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అడుగు ముందుకువేసింది. ఈ మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయించేందుకు కూడా ఆర్టీసీ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఏటూరునాగారం బస్సు డిపోలో పనిచేసేందుకు డ్రైవర్లు, కండక్ట ర్లు, ఇతర సిబ్బంది ఎవరైనా సుము ఖంగా ఉంటే తెలియజేయాలని కోరినట్లు సమాచారం.

హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నం వరకు గల 163 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సుమారు రూ.350 కోట్ల వ్యయంతో ఏటూరునాగారం మండలం ముల్లెకట్ట గోదావరి నదిపై వంతెన నిర్మాణం చేపట్టారు. ఇక ఛత్తీస్‌గఢ్‌లోని భూపాలపట్నం, బీజాపూర్ నుంచి కూడా ఏటూరునాగారంకు రాకపోకలు పెరిగాయి. దీంతో ఇక్కడ బస్సు డిపో ఏర్పాటు అనివార్యమైంది. ఇటీవలే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క కూడా ఏటూరునాగారంలో తప్పకుండా కొత్తగా బస్సు డిపో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. మంత్రి సీతక్క ప్రకటించినట్లుగా బస్సు డిపో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. ఇందుకు ఇటీవల బస్సు డిపో స్థలాన్ని, బస్టాండ్‌ను ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర పరిశీలించారు. బస్సు డిపోలో కావాల్సిన బంకు, వాహనాల సర్వీసింగ్ షెడ్‌లు, సీసీ రోడ్డుతో పాటు తదితర డిజైనింగ్ నమూనా ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి అందుకు సంబంధించిన వివరాలను త్వరితగతిన సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సూచించారు.

20 నుంచి 25 బస్సులతో ప్రారంభం..

ఏటూరునాగారంలో బస్సు డిపో ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కోసం అధికారులు ప్రతిపాదనలను సిద్ధం

» మిగతా 8వ పేజీలో...

క్రైం కార్నర్



ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, లారీ

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

డ్రైవర్లకు తీవ్ర గాయాలు

స్వల్పంగా గాయపడ్డ 20 మంది ప్రయాణికులు



గాయపడిన ఉపాధ్యాయుడు శామయ్య

తాడ్వాయి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పస్రా-తాడ్వాయి మార్గమధ్యంలోని మండలంలోని జనగలంచవాగు సమీపంలో 163వ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. మంగపేట నుంచి హనుమకొండ వైపు ఆర్టీసీ బస్సు వెళుతోంది. పస్రా నుంచి ఏటూరునాగారం వైపు పైపుల లోడుతో వస్తున్న లారీ మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును జనగలంచవాగు సమీపంలో ఢీకొంది. దీంతో బస్సు, లారీ డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాకుండా బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి కాళ్లు, చేతులు, ముఖాలపై స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తాడ్వాయి పోలీసులు చికిత్స నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనతో రోడ్డుకు ఇరువైపులా సుమారు కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మంగపేట వైపు వెళ్లాల్సిన వాహనాలను పస్రా నుంచి నార్లాపూర్, మేడారం, తాడ్వాయి మీదుగా వెళ్లేవిధంగా రాకపోకలను పునరుద్ధరించారు. డ్రైవర్ల పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

నాణ్యమైన భోజనం అందించాలి

జిల్లా విద్యాశాఖాధికారి పాణిని



వాజేడు కేజీబీవీ స్టోర్ రూంను పరిశీలిస్తున్న డీఈవో పాణిని

వాజేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనంను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. బుధవారం మండలంలోని కొప్పుసూరు పాఠశాలలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం తీరును పరిశీలించారు. విద్యార్థులకు భోజనంపై ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, కేజీబీవీలో మరేమైనా సమస్యలు ఉన్నాయా అని అంతర్గతంగా వివరాలు సేకరించారు. విద్యార్థులకు నాణమైన విద్య, వసతిని కల్పించి దేశ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొయ్యూర్‌లో భారీ వర్షం

తడిసిన వరి ధాన్యం



కొయ్యూర్‌లో కొనుగోలు కేంద్రంలోకి చేరిన వరద నీటిని తోడుతున్న రైతు

మల్హర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొయ్యూర్‌లో బుధవారం సాయంత్రం సుమారు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రంలో పోసిన వరి ధాన్యం తడిసిపోయింది. ధాన్యం కుప్పల చుట్టూ వరద నీరు చేరడంతో రైతులు నీటిని బయటకు పంపించారు. అలాగే వర్షానికి ధాన్యం తడవకుండా కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పారు. ఇప్పటికే కాంటాలు సక్రమంగా కాక తంటాలు పడుతుంటే కురిసిన అకాల వర్షం వల్ల వడ్లు మ్యాచర్ రాక కాంటాలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. స్థానిక అధికారుల పర్యవేక్షణ లేక కాంటాలు పోసి రోజుల గడుస్తున్నా కాంటాల నిర్వహణకు టోకెన్లు ఇవ్వడం లేదని రైతులు తెలుపుతున్నారు. మ్యాచర్ వచ్చిన కాంటాలు కాకపోవడంతో మంథని మండలంలోని నాగెపల్లికి కొంత మంది రైతులు వరి ధాన్యాన్ని అక్కడ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి కాంటాలు త్వరగా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

మేడారంలో భక్తుల సందడి

మేడారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి తల్లుల గద్దెలకు చేరుకున్నారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం అమ్మవార్ల గద్దెలకు సమర్పించి పూజలు చేశారు. కోర్కెలు తీరాలని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 5వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.



వనదేవతను దర్శించుకుంటున్న భక్తులు

గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి



ములుగులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలు ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రైతు భరోసా, రూ.2లక్షల రుణమాఫీ, అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, తదితర పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటిని పక్కనబెట్టి సంబరాలు చేసుకోవడం సరైందికాదని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషిధ ర్‌రెడ్డి, రాష్ట్ర నాయకు డు నాగపురి రాజమౌళిగౌడ్, నియోజక వర్గ కన్వీనర్ మోర రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, నాయకులు వేణుగోపాల్, రవీందర్, శ్రీనివాస్, కిషన్‌రావు, భూమారావు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి..

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చన ఆరు గ్యారంటీల హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని నవాబుపేట, చింతకుంటరామయ్యపల్లి, కైలాపూర్, చల్లగరిగ, జూకల్లు, చిట్యాల మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ చర్యలకు నిరసనగా బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నిషిధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నాగపూరి రాజమౌళి మాట్లాడుతూ 6 గ్యారంటీలు, 420 హామీలు, 66 అబద్ధాలతో కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగుతోందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, బీజేపీ అభ్యర్థులను ఆదరిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల అధ్యక్షులు చెవ్వ శేశగిరి దేశెట్టి గోపాల్, నాయకులు పైదం శ్రీకాంత్, జగ్గయ్య, మాచర్ల రఘు, గుండ సురేష్, గుండ మణికుమార్, పెరుమాండ్ల రాజు, సాద సదానందం, అశోక్‌చారి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ములుగు కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ములుగు జిల్లాకేంద్రం నుంచి వెంకటాపూర్ మీదుగా గోవిందరావుపేట మండలం పస్రా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజాపాలన విజయోత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించే విధంగా ఆర్భాటాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ హామీలపై చార్జ్‌షీట్‌ను ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, అజ్మీరా కృష్ణవేణినాయక్, నాయకులు కొత్త సురేందర్, శీలమంతుల రవీంద్రచారి, ఏనుగు రవీందర్ రెడ్డి, జినుకల కృష్ణాకర్‌రావు, కొత్త సుధాకర్‌రెడ్డి, భూక్య జవహర్‌లాల్, గంగిశెట్టి రాజ్‌కుమార్, రవిరెడ్డి, రాయంచు నాగరాజు, దండిగ వెంకన్న, గాదం కుమార్, పైడాకుల మల్లేష్, కత్తి హరీష్, భైకని మహేందర్, విజయేందర్, భాను, విక్రాంత్‌తోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



గూడూరు గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రేణుక

నాణ్యమైన భోజనం అందివ్వాలి

జనగామ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

పాలకుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందివ్వాలని జనగామ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గూడూరులోని గిరిజన బాలికల గురుకులాన్ని రోహిత్‌సింగ్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోజనం, కూరలు రుచికరంగా వండాలని, టాయిలెట్ల ప్రతీ రోజు శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలి సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు భోజనాన్ని వడ్డించే ముందు మొదట ఉపాధ్యాయులు రుచి చూడాలని ఆదేశించారు. ఆయ న వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాకేష్, ప్రిన్సిపాల్ రేణుక, ఉపాధ్యాయులు ఉన్నారు.

తూకంలో మోసం చేస్తే చర్యలు తప్పవు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం తూకంలో నిర్వాహకులు మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని తొర్రూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సరైన తేమ శాతం ఉన్న ధాన్యానికి వెంటనే కాంటాలు నిర్వహించి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఆయన వెంట చైర్మన్ మైసులు, సిబ్బంది రైతులు ఉన్నారు.

విగ్రహ ఏర్పాటునకు స్థలం ఇప్పించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న గౌడ సంఘాల ప్రతినిధులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలోని కురవి గేట్ వద్ద సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటునకు స్థలం కేటాయించి, అనుమతి ఇప్పించాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల వెంకన్న, గౌడ సంఘాల జేఏసీ కన్వీనర్ సమ్మెట వెంకన్న, గౌడ జనహక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్లు చిట్యాల జనార్దన్, వెన్నం లక్ష్మారెడ్డి, బి.అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, కమిషనర్ రవీందర్‌కు బుధవారం వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా గౌడ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పాపన్న విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుర్ర శ్రీనివాస్, యమగాని వెంకన్న, నక్క నాగార్జున, ముత్యం వెంకన్న, చిత్తనూరి శ్రీనివాస్, ఈరగాని భిక్షపతి, గాడిపెల్లి శ్రీహరి, బిక్కి వెంకటేశ్వర్లు,శ్రీనివాస్, శేఖర్, వీరేందర్, వీరభద్రం, సందీప్, యాదగిరి, గణేష్, మధు, వెంకన్న, రవి, సమ్మయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జనగామ డీఈవో రమేష్



ఖిలాషాపూర్ కేజీబీవీలోని వంట గదిని పరిశీలిస్తున్న డీఈవో రమేష్

రఘునాథపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రమేష్ అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, పాఠశాల పరిసరాలను, స్టోర్ రూంలో భద్రపర్చిన సామగ్రి, తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో జీసీడీవో గౌసియా బేగం, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత, సీఆర్‌పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్మెట నెత్తుటి చరిత్రకు 35 ఏళ్లు

- తుపాకుల మోత.. రక్తపు వరద..
- విప్లవ చరిత్రలో నిలిచిన ఘట్టం



దాడి జరిగిన పోలీస్‌స్టేషన్ (ఫైల్)



నర్మెట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 5.. ఈరోజు వచ్చిందంటే చాలు నర్మెట మండల ప్రజలకు నాటి నెత్తుటి చరిత్ర గుర్తుకొస్తుంది. మావోయిస్టు నక్సల్స్ దళాల కదలికలు ఎక్కువగా జరుగుతున్న ఆ రోజుల్లో రాత్రి సమయం లో ఎవరైనా సంచరిస్తే నక్సల్స్‌గా భావించేవారు. విప్లవోద్యమం ప్రజ్వరిల్లుతున్న నేపథ్యంలో 1990 డిసెంబరు 5 నర్మెట మండల ప్రజలు మరిచిపోలేని చరిత్రాత్మక విషాద ఘటన జరి గింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఆ ఘటన జరిగి నేటికి 34 ఏళ్లు పూర్తవుతున్నా పోలీసుల తుపాకుల మో తలు.. వాటి ఫలితంగా గాయపడిన వారి రోదనలు కాల్పులకు భయపడి చెట్టు, పుట్ట పట్టుకొని పరుగులు తీసి న అప్పటి దృ శ్యాలు స్థాని కులు ఇంకా మరవలేదు. నర్మెట మ ండల కేంద్రం పరిధిలోని ఆగాపేట గ్రామా నికి చెందిన అప్పటి రాడికల్ యువజన సం ఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణం చంద్రమౌళి పీపుల్స్‌వార్ నక్సలైట్లకు సహకరిస్తున్నాడనే కారణంతో పోలీసులు 1990 డిసెంబరు 4న చంద్రమౌళిని అరెస్టు చేశారు. ఆయన అరెస్టుకు నిరసనగా ప్రజలు మండల పరిధిలోని వ్యాపార వాణిజ్య సంస్థలు పాఠశాలలను మూసివేయించారు. వేలాది మంది ప్రజలు వచ్చి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న నక్సలైట్లు మరోవైపు చంద్రమౌళి అరెస్టుకు నిరసనగా యాకూబ్‌అలీ అనే హెడ్ కానిస్టేబుల్‌ను కిడ్నాప్ చేశారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డిసెంబర్ 5న కూడా పోలీసులు చంద్రమౌళిని విడిచిపెట్టక పోవడంతో ప్రజలు రెండో రోజు కూడా బంద్ పాటించి ఆందోళనలను ఉధృతం చేశారు. మరోవైపు పీపుల్స్‌వార్ నక్సలైట్లు ఎంపీడీవోతో పా టు వైద్యాధికారి బ్యాంకుమేనేజర్, ఎల్‌డీసీని కిడ్నాప్ చేశారు.చంద్రమౌళిని విడిచి పెట్టాలని సుమారు 5 వేల మంది ప్రజలు పోలీస్‌స్టేషన్ ఎదుట సాయంత్రం వరకు బైఠాయించారు. అయినప్పటికీ పోలీసు లు స్పందించకపోవడంతో సహనం కోల్పోయిన ప్రజలు పోలీస్‌స్టేషన్‌పై దాడికి దిగారు. దీంతో ఎంత చెప్పినా ప్రజలు వినకపోవడంతో వారి దాడిని ఎదుర్కొనేందుకు పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో 20 మం దికి పైగా తీవ్రంగా గాయపడగా ఇద్దరు పాఠశాల విద్యార్థులు చనిపోయా రు. చివరకు చంద్రమౌళి బెయిల్‌పై విడుదల అయ్యాడు. పీపుల్స్‌వార్ నక్సలైట్లు కిడ్నాప్ చేసిన హెడ్ కానిస్టేబుల్ యాకూబ్‌అలీని డిసెంబర్ 8న తరిగొప్పుల గ్రామ శివారులో చంపిపడేశారు.ఈ సంఘటనతో భయాందోళన చెందిన కొందరు యువకులు గ్రామా లు వదిలి పారిపోయారు. ఆందోళనలో పాల్గొన్నందుకు అప్పుడు సుమారు 500 మందిపై కేసులు నమోదు కాగా వారిలో 300 మందిపై టాడా కేసులు నమోదు అయ్యాయి. ప్రస్తుతం ఆ కేసులు కొట్టివేసినప్పటికీ నాడు జరిగిన సంఘటనలు గుర్తుకు వచ్చినా పాత పోలీస్ స్టేషన్‌ను చూసినా ఆనాటి ఘటన కళ్ల ముందే కదలాడుతుందని స్థానికులు పేర్కొంటారు. ప్రస్తుతం ఆ పాత పోలీస్‌స్టేషన్ లేదు.

సంకలో బుల్లెట్ దిగింది



1990 డిసెంబరు 5న నర్మెట పోలీస్ స్టేషన్ వద్ద పాటలు పాడుతు న్నారని, గొడవ జరుగుతుందని అటువైపు వెళ్లాను. కొద్ది సేపు కాగానే పోలీసులు కాల్పులు జరిపారు. ఏం జరుగుతుందో తెలువలేదు. ఒక్కసారిగా జనాలు గుంపు లుగా పరిగెత్తారు. నేను కూడా పరిగె డుతుండగా నా సంకలో బుల్లెట్ వచ్చి దిగింది. ప్రాణా లతో బయటపడ్డ అప్పటి నుంచి నన్ను తుపాకీ వెంకటయ్యగా పిలు స్తున్నారు. డిసెంబర్ వచ్చిందంటే నాటి సం ఘటన కళ్లముందే కన బడుతుంది.

గడపురం (తుపాకీ) వెంకటయ్య, నర్మెట

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది

- కిషన్ రెడ్డి తెలంగాణకు చేసిందేమీ లేదు
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేలాదికోట్ల రూపాయలు కమీషన్లు తీసుకొని బీఆర్‌ఎస్ నేతలు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను ఒక్క కూడా వాడకుండానే రాష్ట్రంలో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి ఆల్‌టైమ్ రికార్డును కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. బుధవారం ఘన్‌పూర్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందించి మాట్లాడారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ఎమ్మెల్యేగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇప్పటికే రూ. 745 కోట్ల అభివృద్ధి పనులు నియోజకవర్గానికి తీసుకువచ్చానని పేర్కొన్నారు. వచ్చే మార్చి 31 వరకు నియోజవర్గానికి రూ. 1000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు తీసుకువచ్చి తీరుతానని స్పష్టంచేశారు. ఘన్‌పూర్‌లో 45కోట్లతో 100 పడకాల ఆస్పత్రి, 30కోట్లతో డిగ్రీ కళాశాల, దేవాదుల ఆర్‌ఎస్ కెనాల్ మరమ్మతులకు రూ. 148 కోట్లు, యంగ్ ఇండియా పాఠశాలకు రూ. 200 కోట్లు, రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్‌కు రూ. 26 కోట్లు, తాటికొండ రోడ్డు అభివృద్ధికి రూ. 15 కోట్లు, రూ. 10కోట్లతో కమ్యూనిటీ భవనాలు మంజూరు ఇవ్వడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పాలనను చూసి ఓర్వలేకపోతున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారంలో ఉన్నన్ని రోజులు రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. అనేక ఏళ్లుగా కేంద్రమంత్రిగా పనిచేస్తున్న ఎంపీ కిషన్ రెడ్డి తెలంగాణకు చేసింది ఏమీలేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వానాకాలం (ఖరీఫ్)లో కాళేశ్వరం జలాల అవసరం లేకుండానే 66లక్షల 70వేల ఎకరాల్లో 1.53 కోట్ల మెట్రిక్‌టన్నుల ధాన్యం పండించి రికార్డు సృషించామన్నారు. ఏడాదిలో రాష్ట్రంలోని 25,35,964 మంది రైతులకు రూ. 20,617 కోట్ల రుణాలను మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఇది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు.

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఏడాది కాలంలో 55,143 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదని అన్నారు. ఈ మూడింటిలో ఏఒక్కటి నిజం కాకున్నా క్షమాపణలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్యరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్ రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, నాగరబోయిన శ్రీరాములు, బూర్ల శంకర్, కోతి రాములు తదితరులు పాల్గొన్నారు.



కిషోర్ మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

మావోయిస్టు కిషోర్ మృతదేహం అప్పగింత

రెండు మృతదేహాలు ఇంకా మార్చురీలోనే..

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండలంలోని చల్పాక వద్ద ఈనెల 1వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. అందులో నలుగురి మృతదేహాలను పోస్టుమార్టం చేపట్టి నంతరం ఈనెల 3న వారి బంధువులకు అప్పగించారు. మిగతా ముగ్గురి మృతదేహాల్లో దళసభ్యుడు కిషోర్ మృతదేహాన్ని పోలీసులు బుధవారం రాత్రి బంధువులకు అప్పగించారు. కిషోర్ స్వస్థలం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పాంఫేడ్ గ్రామానికి చెందిన వాడు. కిషోర్ అన్న పూనేష్‌కుమార్ తన స్వస్థలం నుంచి ఏటూరునాగారం చేరుకోవడానికి రాత్రి కాగా, స్థానిక సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్‌లు కన్నాయిగూడెం తహసీల్దార్ వేణుగోపాల్ సమక్షంలో కిషోర్ మృతదేహాన్ని అప్పగించగా అంబులెన్స్ ద్వారా స్వస్థలానికి తరలించారు. చల్పాక ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందగా ఇప్పటి వరకు పోలీసులు ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు.

మిగతా ఇద్దరి మృతదేహాల్లో ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య కాల్వల ఐలమ్మ అలియాస్ మీనా తన భర్త ఎన్‌కౌంటర్ బూటకమని హైకోర్టులో పిటిషన్ వేశారు. కాగా, హైకోర్టు విచారణను గురువారానికి వాయిదా వేసింది. గురువారం హైకోర్టులో ఈ కేసుపై విచారణ కొనసాగనుంది. కాగా, మావోయిస్టు దళ సభ్యుడు బైసింగ్ బంధువుల రాక ఆలస్యం కావడంతో బైసింగ్ మృతదేహం సామాజిక వైద్యశాలలోని మార్చురీలో పోలీసులు భద్రపరిచారు.

జీడికల్ ఆలయానికి రూ. 4.87 లక్షల ఆదాయం

లింగాలఘణపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుప్రసిద్ధ జీడికల్ వీరాచల శ్రీరామచంద్రస్వామి ఆలయానికి రూ. 4,87,299ల ఆదాయం సమకూరినట్లు ఈవో చిందం వంశీ తెలిపారు. బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపు ద్వారా రూ. 2,77,299లు ఆదాయం రాగా, కొబ్బరికాయల వేలం ద్వారా రూ. 2.10 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. మహబూబాద్‌కు చెందిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ట్రస్ట్ సభ్యులు హుండీ లెక్కింపును చేపట్టారని ఈవో తెలిపారు. కొబ్బరికాయల వేలం హక్కులను దుగ్గొండి మండలం మహ్మద్‌పూర్‌కు చెందిన రమేశ్‌బాబు పొందారని తెలిపారు. అయితే గతేడాది బ్రహ్మోత్సవాల కంటే ఈ సారి హుండీ ఆదాయం అదనంగా రూ. 43,549 రాగా, కొబ్బరికాయల వేలం ద్వారా రూ. 8వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ మూర్తి, భరత్‌కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అయ్యప్ప కృపకు పాత్రులు కావాలి

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



అయ్యప్ప ఆలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హరిహర పుత్ర అయ్యప్ప స్వామి కృపకు ప్రతీ ఒక్కరు పాత్రులు కావాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం తొర్రూరులోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన కన్నెస్వామి పూజకు హాజరై, ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పదునెట్టాంబడి పూజ ప్రారంభించి, పండితులతో ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ భక్తిభావం కలిగి ఉండాలని, మానసిక ప్రశాంతత భక్తిని పెంపొందించుకునేందుకు మాల ధరించడం ఎంతో అభినందనీయమన్నారు. 30 ఏళ్లుగా తొర్రూరు ప్రాంతంలో ఎంతోమంది భక్తులు మాలలు ధరించి, పూజలు నిర్వహిస్తున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం తన సహకారాన్ని అందిస్తానని వివరించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి మరిన్ని పథకాలు ప్రవేశపెట్టనున్నారని పేర్కొ న్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో హరిహర క్షేత్రం ఆలయ కమిటీ నిర్వాహ కులు దారం ప్రసాద్, బిజ్జాల వెంకటరమణ, ఇమ్మడి రాంబాబు, మాజేటి నర్సింహారావు, దాతలు చీదర మహేష్, జగదీశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, నరేందర్ రెడ్డి, నాగిరెడ్డి, రాంచంద్రయ్య, కృపాకర్‌రాజు, బిజ్జాల అనిల్, రాంచంద్రయ్య, హమ్యానాయక్, సుంచు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మరిపెడలో కేంద్ర బృందం పర్యటన



ఉల్లేపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మరిపెడ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత సెప్టెంబరు 1వ తేదీన పురుషోత్తామాయగూడెం వద్ద ఉన్న ఆకేరువాగుకు వచ్చిన వరద తాకిడికి నష్టపోయిన బాల్నిధర్మారం, సీతారాంనాయక్ తండా, బీచ్‌రాజ్‌పల్లి, ఉల్లేపల్లిలలో రైతాంగాన్ని, ప్రజలను కేంద్రబృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వరద బాధితులతో బృందం మాట్లాడి, నష్టం వివరాలను సేకరించింది. భారీ వర్షాలతో మరిపెడ మండలంలోని వేలాది ఎకరాల్లో పంటనష్టం, నివాస గృహాల్లోకి సజ్జా లెవల్ వరకు నీరు చేరడం, ఉల్లేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వరద నీరు రావడం జరిగిందని గ్రామస్థులు అధికారులకు తెలిపారు. వరద తాకిడితో రోడ్లు దెబ్బతిన్నాయని వివరించారు. వరదలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయాగ్రామాల ప్రజలు అధికారు లకు మొరపెట్టుకున్నారు. వరద తగ్గిన తర్వాత నిర్వహించిన పారిశుధ్య పనులు, పోలీసులు, వైద్యశాఖ తోడ్పాటు ఎంతో ఉందని కేంద్రబృందం సభ్యులకు బాధితులు చెప్పారు. కేంద్ర అధికారుల బృందం సభ్యులు ప్రవీణ్, రవి, పుష్పాగ్ర, ఐశర్య, ప్రదీప్‌కుమార్, వరుణ్, సాయిబాబా, పాల్, జిల్లా డీఆర్‌డీవో మధుసూదన్ రాజు, ఏడీ సర్వేల్యాండ్ అధికారి నరసింహమూర్తి, డీసీవో వెంకటేశ్వర్లు, డీఏవో విజయకుమారి, డీహెచ్‌వో మరియన్న, తహసీల్దార్ సైదులు, ఏవో వీరాసింగ్, ఐకేపీ ఏపీఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు



నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న విజయరామారావు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పోయిందని, ప్రజలు చీదరించుకుంటున్నారని స్థానిక ఎన్నికల్లో భంగ పాటు తప్పదని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు తెలిపారు. ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల పేరుతో 66 మోసాలు చేసిందని నిరసిస్తూ బీజేపీ నాయకులు బుధవారం బైక్ ర్యాలీ చేబట్టారు. అనంతరం శివాజీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జీవీఆర్ మాట్లాడారు. కేసీఆర్ కాళేశ్వరంపై వేలకోట్ల కమీషన్లు తీసుకుంటే, రేవంత్ రెడ్డి మూసీనది ప్రక్షాళన, హైడ్రా పేరుతో కోట్లాది రూపాయల కమీషన్ తీసుకుంటున్నాడని ఆరోపించారు. కేసీఆర్, రేవంత్ ఇద్దరు ఒకే తాను ముక్కలుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

ఈ కార్యక్ర మంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, వరం గల్ పార్లమెంట్ కో కన్వీనర్ యుగేందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, సౌడ రమేష్, పార్టీ మండలాధ్యక్షులు సట్ల వెంకటరమణ, గంటె ఉపేందర్, నాయకులు బూర్ల విష్ణు, రడపాక ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2416	2080
పల్లికాయ (సూక)	3900	4000
పల్లికాయ (పచ్చిది)	5100	3000
కందులు	-	-
పెసళ్లు	6089	5250
పత్తి	6950	5800
కొత్తపత్తి	-	-
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	12000	9000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	14100	11000
యూఎస్341ఏసీ	14000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

నిర్మాణ లోపంతో ఇల్లు కదిలిందేమోనని భయపడ్డా

మడూరి వెంకటేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బాలాజీనగర్, జనగామ



ఉదయం లేచి బెడ్ మీద కూర్చొని ఉండగా ఒక్కసారిగా భూమి కంపించింది. ఇంట్లో కిచెన్‌లోని వసువులు కదిలాయి. మాది కొత్తగా నిర్మించిన ఇల్లు కావడంతో నిర్మాణ లోపాలతో ఇలా జరిగిందేమోనని ఆందోళనకు గురయ్యా. బయటకు వచ్చి చూసే సరికి.. చుట్టుపక్క వారంతా బయటకొచ్చి తమ ఇళ్లు కూడా కంపించాయని చెప్పారు. దీంతో భూకంపం వచ్చిందని నిర్ధారణకు వచ్చాం. తర్వాత మా ఇంటి సీసీ కెమెరాలు పరిశీలించిన తర్వాత సరిగ్గా 7:27నిమిషాలకు ప్రకంపనలు వచ్చినట్టు రికార్డయ్యింది.

ప్రకంపనలకు గోడ కూలింది



ఆత్కూరి నేతాజీ, శంకరాజుపల్లి, ఏటూరునాగారం

ఉదయం ఒక్కసారిగా ఇల్లంతా ప్రకంపనలు వచ్చాయి. దాంతో భయపడ్డాం. క్షణంలోనే ప్రహరీ కూలిపోయింది. ఇల్లు కూడా కూలుతుందేమో అనుకున్నాం. ఇంట్లోని సామగ్రి కిందపడిపోయాయి.

భయాందోళనకు గురయ్యాం

కలకోట భాస్కరాచారి, కొత్తవాడ, వరంగల్



ఉదయం ఏడున్నర ప్రాంతంలో భూమి కంపించడంతో భయాందోళనకు గురయ్యాం. ఇంట్లో ఉన్న వంట పాత్రలు కిందపడడంతో మా పిల్లలు ఇంట్లోంచి బయటకు పరుగుతీశారు. నేను కూడా బయటకు వచ్చే సరికి పక్క ఇళ్ల వాళ్లు భూకంపం వచ్చిందని చెప్పడంతో నాకు భయమేసింది. ఇంకా కొంచం తీవ్రత ఎక్కువ ఉంటే ఏమై ఉండేదనిపించింది.

భూమి కంపించడంతో భయమేసింది



రహీం, బ్యాంకు ఉద్యోగి ఉర్సు దర్గా ప్రాంతం, వరంగల్

ఒక్కసారిగా భూమి కంపించినట్టు అనిపించడంతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు, మంచాలు.. కదిలాయి. దీంతో ముందు ఆశ్చర్యపోయాం. అనంతరం భూమి కంపిస్తుందని అర్థం చేసుకుని వెంటనే పిల్లలతో సహా ఇంట్లో నుంచి బయటకు వచ్చేశాం. అరగంట పాటు బయట ఉండి కాసేపటికి అంతా మాములుగా ఉండటంతో తిరిగి ఇంట్లోకి వెళ్లాం.

అపార్ట్‌మెంట్‌లోని వారంతా పరుగు తీశారు

గోగుల యాకయ్య, కాజీపేట



భూకంపం వల్ల భయంతో అపార్ట్‌మెంట్ వాసులంతా భయంగా బయటకు పరుగుతీశారు. ఫ్లాట్స్‌లో సామాన్లు కంపించాయి. వెలుపలకు వచ్చాక కూడా చాలా సమయం వరకు ఫ్లాట్లలోకి వెళ్ల లేదు. గంటకు పైగా వేచి చూసిన తరువాతే వెళ్లారు.

ఆలస్యం బతికించింది



భాగ్యలక్ష్మి, టైలర్, ఇందిరానగర్, హనుమకొండ

నాకు హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌లో టైలర్ షాపు ఉంది. రోజూ ఉదయాన్నే 7:20 గంటల నుంచి 7:30లోపు వచ్చి షాపు తెరుస్తా. కానీ ఇవాళ ఇంట్లో పని వల్ల కాస్త ఆలస్యమైంది. కానీ నేను షాపు వద్దకు చేరుకునే సరికి అప్పటికే షాపు ఉన్న భవనం పోర్టికో కూలింది. అదే రోజులాగే షాపు వద్దకు వచ్చి ఉంటే ప్రాణం పొయ్యేదేమో అని అనిపించింది.

చెరువులోంచి వింత శబ్దం వచ్చింది

బానోత్ వెంకన్న, కేసముద్రం మండలం రేకులతండా



నాతోపాటు మరో ఐదుగురం చెరువులో ఈతకొట్టి తిరిగి వెళుతున్నాం. చెరువు ఒడ్డున గడ్డిలోంచి పాము బుసకొట్టినట్టుగా శబ్ధం రావడంతో భయాందోళనకు గురయ్యాం. పెద్ద పాము ఉండవచ్చని రాళ్లు, కర్రలతో అదే ప్రాంతంలో గాలించాం. కానీ ఏమీ కనిపించలేదు. అయితే ఆ శబ్ధం ఆగకుండా రావడంతో ఓ వీడియో తీశా. అయితే భూ కంపనాల వల్ల చెరువు అడుగుభాగం నుంచి శబ్ధం వచ్చిందని తెలుసుకుని ఆశ్చర్యపోయాం.

సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపా



యాదగిరి, పోలీస్ కానిస్టేబుల్, వంగర, భీమదేవరపల్లి

పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నా. నాలుగు సెకన్ల పాటు భూ ప్రకంపనలు వచ్చాయి. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించా. వారి ఆదేశాలతో గ్రామస్థులకు భూకంపం విషయమై అవగాహన కల్పించాం. భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పాం.

భయం వేసింది..

సిద్దబోయిన ఆనంద్, సమ్మక్క పూజారి



పూజ సమయంలో మేడారం అమ్మవారి గద్దెల ప్రాంగణం కంపించడం చూసి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కాసేపటికి తేరుకున్నాం. భూమి ప్రకంపనల అనంతరం భూ కంపం వచ్చిందని, అది మళ్లీ వస్తుందని భక్తులు చర్చించుకోవడం, మీడియాలో రావడంతో మరింత భయం అనిపించింది. ఈ తీవ్రత 5రోజుల వరకు ఉంటుందంటున్నారు.

మూడో జోన్‌లో తెలంగాణ.. నష్టం జరుగదు

పూరే గురునాథరావు, జిల్లా సైన్స్ కమ్యూనికేటర్, మహబూబాబాద్



భూకంపాలు.. వచ్చే ప్రాంతాలను ఐదు జోన్‌లుగా విభజిస్తారు. రిక్టర్ స్కేల్‌పై 1, 2 జోన్ల పరిధిలో వచ్చే భూకంపాలు పెద్దగా గుర్తించే అవకాశాలు ఉండవు. 3వ జోన్‌లో మాత్రం కొంత ప్రకంపనల ప్రభావం కన్పిస్తుందే తప్ప.. పెద్దగా నష్టం కలిగించదు. తెలంగాణ ప్రాంతం మూడోజోన్‌లో ఉండడంతో నష్టం కూడా జరిగే అవకాశాలు లేవు. 4, 5వ జోన్లలో భూకంపం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఆస్తి, ప్రాణనష్టం జరుగుతుంది. ఉదాహరణకు 2001 గుజరాత్ భూకంపం 7.7 రిక్టర్ స్కేల్. 2004 ఇండోనేషియా భూకంపం (సునామీతో పాటు) 9.1 రిక్టర్ స్కేల్.. 2015 నేపాల్ భూకంపం 7.8 రిక్టర్ స్కేల్‌తో పాటు హిమాలయ పర్వతాల్లో కూడా చోటు చేసుకుంటాయి.

భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలకు తావులేదు..

ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి, కేయూ జియాలజీ విభాగాధిపతి



1969 నుంచి గతంలోనూ అనేక దఫాలుగా తెలంగాణ ప్రాంతంలో భూకంపాలు నమోదయ్యాయి. భూమిలోని భ్రంశాలు (పగుళ్ల) కారణంగా భూకంపాలు సంభవిస్తాయి. భద్రాచలం, కిన్నెరసాని, గోదావరి లోయ ప్రాంతాల్లో భూకంపాల భ్రంశాలు ఎక్కువగా ఉన్నాయి. 2018లో భద్రాచలం ప్రాంతంలో స్వల్పంగా భూమి కంపించింది. బుధవారం సంభవించిన భూకంపం మన దగ్గర 5.3గా నమోదవగా.. అదే సమయంలో అమెరికాలోని పలు ప్రాంతాల్లోనూ రికార్డు అయింది. భవిష్యత్‌లోనూ మన ప్రాంతానికి భూకంపం వల్ల తీవ్ర నష్టలేమీ ఉండదు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ఇటీవల ఏటూరునాగారం ప్రాంతంలో భారీవృక్షాలు నేలకూలి పోవడానికి బుధవారం సంభవించిన భూకంపాలకు ఎలాంటి సంబంధం లేదు. బొగ్గు గనుల తవ్వకాల వల్ల కూడా కాదు.

భయపడాల్సిన అవసరం లేదు..

ప్రొఫెసర్ వడ్డె రవీందర్, కేయూ రసాయన శాస్త్ర విశ్రాంతాచార్యులు, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జాయింట్ సెక్రెటరీ



బుధవారం వచ్చిన భూకంపం గురించి భయపడాల్సిన అవసరం లేదు. తెలంగాణ ప్రాంతం దక్కన్ పీఠ భూమి కావడం వల్ల భూకంపల తీవ్రత ప్రమాదకర స్థాయిలో ఉండదు. జరిగిన భూకంపం తీవ్రత 5.3 నమోదైంది. అందుకే ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం లేదు. ప్రకంపనల తీవ్రత 5.7 మించితేనే ప్రమాదకరం. మళ్లీ భూకంపం వస్తుందనే ప్రచారంతో భయందోళనకు గురి కావద్దు. అయితే బుధవారం సంభవించిన భూకంపం విషయంలో లోతైన పరిశోధనలు జరగాలి అప్పుడే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయి.

హెచ్చరించే స్థాయిని దాటుతున్న ప్రకృతి

సుతారి సతీష్, పర్యావరణవేత్త



అభివృద్ధి, ఆధునికత రూపంలో మానవుడు ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నాడు. తీవ్రంగా ప్రభావితమవుతున్న ప్రకృతి మనిషిని హెచ్చరించే స్థాయిని దాటి మొన్న టోర్నడో, నేడు భూకంపం రూపంలో ఆగ్రహిస్తున్నా ఎవరిరీ అర్థం కావడం లేదు. మనిషి మారాలి.. లేకుంటే ప్రకృతే మారుస్తుంది..



మహబూబాబాద్‌లో భూ ప్రకంపనలతో ఓ ఇంట్లో కిందపడిన వంట గిన్నెలు



భయందోళనలతో బయటకు వచ్చి చర్చించుకుంటున్న ప్రజలు



భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో ఏర్పడిన రంధ్రం

భూకంపం.. భయం.. భయం

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు సెకన్ల పాటు కంపనాలు
- మేడారం కేంద్రంగా వచ్చిందని తెలియడంతో మరింత ఆందోళన

భూపాలపల్లి / ములుగు/ మహబూబాబాద్/ జనగామ / వరంగల్ సిటీ/ హనుమకొండ సిటీ , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూ కంపం.. ఏ నోట విన్నా ఇదే చర్చ. బుధవారం ఉదయం7:27నిమిషాలకు వచ్చిన ప్రకంపనలతో ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు భయంతో వణికిపోయారు. మొత్తం మూడు సెకన్ల పాటు భూమి కంపించడంతో మొదట ఏం జరిగిందో అర్థం కాక గందరగోళానికి గురయ్యారు. తొలుత ఇళ్లపై కోతులు దుంకడం, సామగ్రి పడేయడం లాంటివి చేసి ఉంటాయని భావించారు. అలాంటిదేమీ లేకపోవడం, ఈ లోపు సోషల్‌మీడియా, న్యూస్ చానళ్ల ద్వారా భూకంపం సంభవించిందని తెలుసుకుని భయపడ్డారు. ప్రకంపనల సమయంలో ఆందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన వారంతా గంటల తరబడి రోడ్లపైనే ఉండి చర్చించుకోవడం కనిపించింది. ఉదయం వేళ ప్రజలంతా తమతమ పనుల్లో నిమగ్నమైన సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దాలు రావడంతో ఏమి జరుగుతుందోనని అయోమయానికి గురయ్యారు.

అసాధారణ రీతిలో కుక్కల అరవడం, పక్షులు అటూఇటూ ఎగరడాన్ని ప్రత్యక్షంగా చూసిన వారు భయంతో వణికిపోయారు. కాంక్రీటు బిల్డింగులు, పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు ఒక్కసారిగా కదిలాయి. రేకుల ఇళ్లలో తీవ్రత కాస్త ఎక్కువగా కనిపించింది. భూమి కంపనాలతో ఇళ్లలోని వస్తువులు కదిలాయి. కొన్ని చోట్ల వంటింట్లోని పాత్రలు కిందపడ్డాయి. పలుచోట్ల భూమి కంపించినతీరును సీసీ కెమెరాల్లో దృశ్యాల ద్వారా చూశారు. అలాంటి వీడియోలు మీడియా చానళ్లలో ప్రసారమయ్యాయి. అయితే గోదావరి పరిపాక ప్రాంతంలోని ములుగు జిల్లా మేడారం కేంద్రంగా ఈ భూకంపం సంభవించిందని, దీని తీవ్రత రిక్టర్ స్కేల్ పై 5.3 పాయింట్ల మాగ్నటూడ్‌గా నమోదైందని అధికారులు వెల్లడించడంతో తమకు సమీపంలోనే కంపనాలు ప్రారంభయ్యాయని తెలుసుకుని మరింత ఆందోళనకు గురయ్యారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ములుగు జిల్లా మేడారం కేంద్రంగా ప్రారంభమైన ఈ ప్రకంపనలు కృష్ణానది పరివాహక ప్రాంతంలో కూడా నమోదైనట్టు నిపుణులు చెబుతున్నారు ఇంకా కూడా ఈ తరహా ప్రకంపనలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని ఎన్జీఆర్ఐ నిపుణులు చెబుతుండగా.. తెలంగాణ ప్రాంతం భూకంప జోన్-2లో ఉండటం వల్ల పెద్దగా భయపడాల్సిన పనేమీ లేదని, తక్కువ తీవ్రత కలిగిన భూకంపాల వల్ల నష్టమేమీ లేదని చెబుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఇతర చిన్న చిన్న ప్రకంపనాలు చోటు చేసుకోవడం సహజమేనంటున్నారు. ఇటీవల ఇదే అటవీ ప్రాంతంలో 500ఎకరాల్లో సుమారు లక్ష వృక్షాలు నెలకొరగడం, తాజాగా భూ ప్రకంపనలు చోటు చేసుకోవడంతో ఈ ప్రాంత ప్రజల్లో భయాందోళనలు గురవుతున్నారు.

మేడారం సమ్మక్క, సారలమ్మల గద్దెల వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన కంపనాల దృశ్యాలు వైరల్ అయ్యాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో దాదాపు మీటర్ లోతు సింక్ హోల్ ఏర్పడిందని చెబుతున్నారు. అయితే ఈ రంధ్రం భూకంప తీవ్రత కారణంగా ఏర్పడిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయాన్ని నిపుణులు తేల్చాల్సి ఉంది. మహబూ బాబాద్ పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జనగామ జిల్లాలోనూ 3 సెకన్ల పాటు వచ్చిన భూప్రకంపనలతో జనం భయకంపితులయ్యారు. గతంలో జనగామ జిల్లాలో ఎన్నడూ ఈ తరహా భూకంపం రాలేదని కొందరు చెబుతుండగా 30 ఏళ్లకు క్రితం ఓసారి వచ్చినట్లు విన్నామని మరికొందరు చెబుతున్నారు. వరంగల్ జిల్లాలో బుధవారం ఉదయం వచ్చిన భూప్రకంపనలకు ప్రజలు భయాందోళ చెందారు. ఇళ్ల నుంచి జనాలు రోడ్లపైకి వచ్చి చర్చించుకోవడం కనిపించింది. భూమి కంపించిన సమయంలో భవనాలు, చెట్లపై ఉన్న పక్షులు ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాయని, కుక్కలు అరిచాయని చెబుతున్నారు. వరంగల్‌లో తొలిసారిగా భూమి కంపించడం చూశామని స్థానికులు చెబుతున్నారు. ప్రకం పనలు హనుమకొండ జిల్లావాసులను భయభ్రాంతులకు గురిచేశాయి. ఇళ్ల నుంచి జనం బయటకు వచ్చారు. రోడ్లు, వాహ నాలపై వెళ్తున్న వారు హైరానా పడ్డారు.

అయితే కొన్ని మండలాలు, ప్రాంతాల్లో 3 సెకన్లు, మరి కొన్ని చోట్ల 5 సెకన్లు మొత్తంగా 3 నుంచి 7 సెకన్ల పాటు భూప్రకంపనలు వచ్చినట్టు చెబుతున్నారు. భూకంపనాల వల్ల కొన్ని చోట్ల గోడలకు స్వల్పంగా బీటలు వారాయి. హనుమకొండ 8వ డివిజన్ ఇందిరానగర్‌లో ఓ భవనం పోర్టికో కూలింది. దీంతో ఆ ఇంట్లో వారు భయాందోళన చెందారు.

భూగర్భ గనులు పదిలం : సింగరేణి జీఎం

భూకంపం సంభవించినా భూగర్భ గనులు పదిలంగానే ఉంటాయని సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం వచ్చిన భూకంపంతో అండర్‌గ్రౌండ్ గనుల్లో ఏమైనా సమస్యలు ఏర్పడ్డాయా అనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' జీఎంను సంప్రదించగా.. భూకంపం వలన అండర్‌గ్రౌండ్‌లో ఎలాంటి కదలికలు లేవని, మిడిల్ షిఫ్ట్ ఉద్యోగులో గనిలోనే పని చేస్తున్నారని తెలిపారు. పని స్థలాలను సైఫ్టీ పాంయి టాఫ్‌లో పరిశీలించాకే వర్క్‌మెన్‌లను అలోచేయాలని సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. భూకంపాలు సంబవించినప్పుడు ఇప్పటి వకరు అండర్ గ్రౌండ్‌లో ఎలాంటి ప్రమాదాలు జరిగిన దాఖలాలు లేవన్నారు. ఉద యం వచ్చిన భూకంపం గురించి ఎన్‌జీఆర్ఐ అధికారులతో మాట్లాడామని, దాని తీవ్రతను గురించి, ఎఫెక్ట్ గురించి మాట్లాడి తెలుసు కున్నామన్నారు.

కంపించిన మేడారం గద్దెలు

ఆందోళనకు గురైన భక్తులు, పూజారులు

మేడారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం దేవ స్థానం సమ్మక్క సారలమ్మ గద్దెలు బుధవారం ఉదయం వచ్చిన భూకంపానికి కదిలాయి. ఆ సమయంలో గద్దెల వద్ద పూజలు చేస్తున్న పూజారులు, మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఏం జరుగుతుందో తెలియక ఆశ్చర్యానికి గురయ్యారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రకంపనలు వచ్చాయని, అమ్మవార్ల దీవెనలతో ఎలాంటి ప్రమాదం జరగలేదని వారు భోవోద్వేగానికి గురయ్యారు. ఇక మేడారం మండలంలోని పలుగ్రామాల్లో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పర్యటించి భూ ప్రకంపనలకు భయపడాల్సిన అవసరం లేదని సూచించారు.

యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం

చెట్లు కూలడానికి భూకంపానికి సంబంధం లేదు : కలెక్టర్ దివాకర

మేడారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూకంపనాల నేపథ్యంలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడువులలో కూలిన చెట్లకు బుధవారం ఉదయం వచ్చిన భూకంపానికి ఎలాంటి సంబంధం లేదని కలెక్టర్ దివాకర అన్నారు. బుధవారం ఉదయం మేడారంలో పర్యటించిన ఆయన తొలుత వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గద్దెల ప్రాంగణంలో పూజారులతో మాట్లాడి వారి స్వీయ అనుభవాన్ని తెలుసుకున్నారు. ములుగు జిల్లాలో భూకంపం రావడం మొదటిసారి ఏమి కాదని ఇంతకు ముందు చాలా సార్లు వచ్చిందన్నారు. కానీ ఈసారి గతంలో కంటే ఎక్కువ తీవ్రత ఉందని, ప్రజలు అపోహలను నమ్మవద్దని సూచించారు. సైక్లోన్ రెయిన్‌లకు భూమిలో జరిగే మార్పులకు సంబంధం ఉండదని అన్నారు. 2001 నుంచి ఇప్పటి వరకు వరుసగా 5 సార్లు భూమి కంపించిందని 2001లో 3సార్లు, 2023 ఫిబ్రవరిలో ఒక్కసారి 3వ వంతు తీవ్రతతో వచ్చిందని అలాగే ఇప్పుడు 5.3 తీవ్రతతో వచ్చిందని అందుకే అందరికీ అర్థమైందన్నారు. 7కంటే ఎక్కువ తీవ్రత వస్తే ప్రమాదం ఉంటుందన్నారు. చెట్లు కూలిపోంది రెండు తుపానులు కలసినందుకు విధ్వంసం జరిగిందన్నారు.


గతంలో కంటే ఎక్కువ భూకంప తీవ్రత ఉన్నా జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, నష్టాలు జరగలేదని తెలిపారు. ఆయన వెంట ఏవో రాజ్‌కుమార్, తహసీల్దార్ గిరి బాబు, అధికారులు, పూజారులు, ప్రజలున్నారు. ఇక ఉదయం రెండు సెకండ్లపాటు భూమి కంపించడంతో తాను సైతం ఆందోళనకు గురై ఇంటి నుంచి బయటకు వచ్చానని కలెక్టర్ దివాకర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంఘటన జరిగిన వెంటనే అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేశామని, ఏమైనా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగితే తెలియజేయాలని అధికారులకు సూచించామన్నారు. జిల్లాలో చిన్నచిన్న ఇళ్లు ఉన్నవారి వివరాలను సేకరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.



పూజారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

రామప్పకు ముప్పు వాటిల్లలేదు

ఆర్కియాలజీ డిప్యూటీ సూపరింటెండెంట్ దేశాయి



ఆలయ పైకప్పును పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భూకంపం సంభవించడం వల్ల ప్రపంచ ప్రఖ్యాతిగాంచి యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి ఎలాంటి ముప్పు వాటిల్లలేదని ఆర్కియాలజీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దేశాయి వెల్లడించారు. బుధవారం ఉదయం భూకంపం సంభవించిన అనంతరం కేంద్ర పురావస్తుశాఖ అధికారులు, సాంకేతిక బృందం రామప్పను సందర్శించింది. రామప్ప రమణీయత, శిల్పాలు, దేవాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. భూకంపం సంభవించడం వల్ల రామప్పకు ఎలాంటి హాని జరుగలేదని స్పష్టం చేశారు. ఎందుకంటే రామప్ప దేవాలయానికి తేలికైన ఇటుకలు ఉపయోగించడం వల్ల ఎర్త్‌క్వార్క్ రెసిస్టెంట్ ఆర్కిటెక్చర్‌గా మారదని, పునాది వేయడానికి ముందు వారు సాండ్‌బాక్స్ టెక్నాలజీ అనే సాంకేతికతను ఉపయోగించినట్టు వివరించారు. భూకంపాల వల్ల నష్టం జరుగకుండా ఇందుకోసం ఆకాలంలోనే మూడుమీటర్ల లోతు మట్టిని తవ్వి అందులో ఇసుక, గ్రానైట్ పౌడర్, బెల్లంపొడి నింపడం వల్ల ఏదిశ నుంచి వైబ్రేషన్ వచ్చినా నియంత్రించుకునే శక్తి వాటికి ఉందని పేర్కొన్నారు. భూకంపాలను తట్టుకోవడానికి పైకప్పు, స్తంభాలపై కొన్ని రంధ్రాలు ఉంటాయని, సాండ్‌బాక్స్ టెక్నాలజీతోపాటు ఇనుప డోవెల్‌ను, తేలియాడే ఇటుకలు భూకంపాలను తట్టుకోగల శక్తి ఉంటుంది. ఎలాంటి భూకంపాలు వచ్చినా రామప్ప దేవాలయానికి తట్టుకోగల శక్తి ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనవెంట ఆర్కియాలజీ ఏఈ కృష్ణచైతన్య, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి నవీన్‌కుమార్, తదితరులున్నారు.

మేడిగడ్డ బ్యారేజీ లెవల్స్ పరిశీలన



బ్యారేజీ గేట్లు, పిల్లర్లను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూకంపనాల నేపథ్యంలో మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ అధికారులు అప్రమత్తమయ్యారు. బ్యారేజీ వద్ద ఉన్న కంట్రోల్ రూం కూడా కంపించిందని, దీంతో అధికారులంతా బయటకు పరుగులు తీసినట్టు తెలిసింది. దీంతో అధికారులు హుటాహుటిన బ్యారేజీలో కుంగుబాటుకు గురైన ఏడో బ్లాక్‌ను పరిశీలించారు. బ్లాక్‌లో రోజువారి లెవల్స్‌ను పరిశీలించాక ఎలాంటి తేడాలు లేవని తేలడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంజనీర్లు, సిబ్బంది బ్యారేజీలోని పిల్లర్లు, వంతెన, గేట్లను తనిఖీ చేశారు. కాగా, భూకంపం సంభవించడానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఓ కారణమే అంటూ ఓ శాస్త్రజ్ఞుడు చేసిన వ్యాఖ్యలతో అందరి దృష్టి మేడిగడ్డ వైపు మళ్లింది. బ్యారేజీ నిర్మాణలతో భూకంపాలు సంభవిస్తే కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ముందు ఆ ప్రాంతానికి దగ్గరలో తుపాకులగూడెం బ్యారేజీ ప్రభావమే అయి ఉండొచ్చు కదా.. అని ఓ నిపుణుడు చెప్పుకొచ్చారు.

మేడారం మిస్టరీ!

- ప్రకృతి వైపరీత్యాలకు కేంద్ర బిందువుగా అభయారణ్యం
- కొండాయిపై జంపన్నవాగు ఉప్పెనతో 8 మంది బలి
- టోర్నడో బీభత్సంతో నేలకూలిన వనం
- ఇప్పుడు భూకంపం పుట్టింది ఇక్కడే
- భక్తుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన



మేడారంలో మునిగిన ఇళ్లు (ఫైల్)

ములుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మల వీర చరిత్ర విశ్వవ్యాపితమైనా రూపంలేని ఆ తల్లుల మహిమ ఇప్పటికీ మిస్టరీయే.. వనదేవతలుగా కోటానుకోట్ల భక్తుల పూజలందుకుంటూ భక్తిశిఖరంపై కొలువయ్యారీ దేవతలు. మేడారం ఊరి పేరు స్మరిస్తేనే ఆధ్యాత్మికతతో పారవశ్యాన్ని పొందే భక్తులకు గత రెండేళ్లగా ఈ ప్రాంతం వార్తల్లో ప్రముఖంగా నిలుస్తుండటం, ప్రకృతి వైపరీత్యాలకు కేంద్రబిందువుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నిగ్గుతేల్చలేని నిఘాడ రహస్యాలతో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. బుధవారం ఉదయం తెలుగు రాష్ట్రాలను కంపింపజేసిన భూకంప కేంద్రం మేడారం-ఐలాపూర్ అడవుల్లో శాస్త్రవేత్తలు గుర్తించడంతో స్థానికులతో పాటు వనదేవతల భక్తులకు ఆందోళనకు గురిచేస్తోంది. అసలు మేడారం చుట్టూ ఏంజరుగుతోంది..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2023 జూలై 27న ములుగు జిల్లాలో భారీ వర్షం కురిసింది. జంపన్నవాగుకు ఊహించని విధంగా వరద పోటెత్తడంతో ఉప్పెనలా మారింది. మేడారం గ్రామంపై విరుచుకుపడగా ఇళ్లన్నీ మునిగిపోయాయి. జనం పైకప్పుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. తొలిసారి జంపన్నవాగు జలాలు వనదేవతల గద్దెలను ముంచెత్తాయి. ఈ విపత్తును చూసిన స్థానికులు, భక్తులు భయాందోళన వ్యక్తంచేశారు. ఇదే సమయంలో గోదావరిలో అంతర్ధానమయ్యే క్రమంలో మేడారానికి 10కిలోమీటర్ల దూరంలోని ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంపై జంపన్నవాగు జలపంజా విరిసింది. దీంతో ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. సాధారణంగా గోదావరి నది ఉగ్రరూపం దాల్చుతుండటం పరివాహక ప్రజలకు తెలిసిందే. కానీ, మేడారం భక్తులు పుణ్యపుష్కరిణిగా కీర్తించే జంపన్నవాగు జనాన్ని బలితీసుకోవడం భక్తుల్లో చర్చకు దారితీసింది. ఈఏడాది ఆగస్టు 31ఐలాపూర్ అడవుల్లో పుట్టిన రాకాసి సుడిగాలి మేడారం సమీపంనుంచి తాడ్వాయి వరకు అభయారణ్యాన్ని అతలాకుతలం చేసింది. సుమారు 500ఎకరాలలో లక్షకు పైగా భారీ వృక్షాలు నేలకూల్చింది. ఊహకందని ఈ విపత్తును చూసినవారంతా నోళ్లెళ్లబెట్టారు. తల్లులకు కోపం వచ్చిందా..? అనే చర్చా జరిగింది. పర్యావరణవేత్తలు, పలువురు శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలించారు. అరేబియా మహాసముద్రం, బంగాళాఖాతంలో ఒకేసారి తుపానులు పుట్టడం, ఆకాశంలో మేఘాలు విస్ఫోటనం చెందడంతో ఏర్పడ్డ భారీ సుడిగాలి కారణంగా చెట్లు నేలకూలినట్లు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. కానీ, దీనిపై ఇప్పటికీ శాస్త్రీయంగా స్పష్టమైన సమాధానం దొరకలేదు. తాజాగా 5.3తీవ్రతతో భూమి కంపించడం, భూకంప కేంద్రం మేడారానికి ఉత్తరదిశలోని ఐలాపూర్ సమీపంలో గుర్తించడం వనదేవతల భక్తులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. మేడారంతోపాటు ఐలాపూర్‌లో కూడా సమ్మక్క జాతర జరుగుతుంది. అక్కడ కూడా వనదేవతలకు గద్దెలుండగా రెండేళ్లకోసారి వేలమంది భక్తులతో ఉత్సవం చేస్తారు. ఇదిలా ఉంటే 2024మేడారం మహాజాతర జరిగిన తర్వాత ముగ్గురు వనదేవతల పూజారులు కన్నుమూశారు. వీరిలో ఇద్దరు సమ్మక్క పూజారులు కాగా ఒకరు సారలమ్మ పూజారి. తల్లులు కొలువైన ఈ పుణ్యస్థలాల చుట్టూరా వరుస ప్రకృతి విపత్తులు సంభవించడం, కొద్దిరోజుల వ్యవధిలోనే ముగ్గురు పూజారులు మరణించడంపై భక్తుల్లో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. ఎవ్వరి విశ్వాసాలకు తగిన విధంగా వారు అభిప్రాయపడుతున్నారు.

తల్లులకు ఆగ్రహం కలిగిందనో.. జాతర నిర్వహించడంలో లేక మేడారంలో ఏదైనా లోపం కలిగిందనే సందేహాలను వ్యక్తపరుస్తున్నారు. ఏదేమైనా ప్రభుత్వం మేడారం చుట్టూ సంభవిస్తున్న ప్రకృతి విపత్తుల మిస్టరీని నిగ్గుతేల్చేందుకు శాస్త్రీయ అధ్యయనం చేయించి జనంలో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని సర్వత్రా కోరుతున్నారు.



ఆగస్టు 31న మేడారం-తాడ్వాయి మధ్య నేలకూలిన వృక్షాలు (ఫైల్)

బహుమతులు అందించిన ఎమ్మెల్యే, కలెక్టర్



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బహుమతులు అందజేశారు. భూపాలపల్లి పట్టణంలోని జంగేడు పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించగా వ్యాసరచన పోటీల్లో కె.అజయ్(ప్రథమ), సాయితేజ(ద్వితీయ), మహేష్(తృతీయ), ఉపన్యాస పోటీల్లో ఐశ్వర్య(ప్రథమ), సాయిప్రసన్న(ద్వితీయ), నితిన్(తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. వీరికి గైడ్ టీచర్‌గా అపర్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం అశోక్ పాల్గొని అభినందలు తెలిపారు.

వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

కాకతీయఖని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఇవ్వనున్న వృత్తి శిక్షణ తరగతులను సేవా అధ్యక్షురాలు సునిత, జీఎం రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వాలంబన కోసం సింగరేణి యాజమాన్యం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. పట్టణంలోని కృష్ణకాలనీలో గల సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు మారుతి, క్రాంతికుమార్, సేవా సభ్యులు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కాటారంలో మెగా షటిల్ టోర్నమెంట్

కాటారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సువిద్య విద్యా సంస్థ సహకారంతో మండల స్థాయి మెగా షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీశైలం, కుమార్, సమ్మయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో పలువురు షటిల్ క్రీడాకారులతో కలిసి మాట్లాడుతూ శని, ఆదివారాల్లో టోర్నీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. టోర్నీ విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలతో పాటు షీల్డ్ అందించడం జరుగుతుందన్నారు. టోర్నీలో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

జెండా ఊపి బస్సును ప్రారంభించిన జీఎం



భూపాలపల్లిలో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కాకతీయఖని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో ఉద్యోగం సాధించి పెద్దపెల్లి జిల్లాలో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకునేందుకు వెళ్తున్న ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన బస్సును బుధవారం ఏరియా జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగం సాధించి నియామక పత్రం అందుకుంటున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. భూపాలపల్లి నుంచి ఒక బస్సును, వరంగల్ నుంచి ఒక బస్సును ఏర్పాటు చేశామని వీటిలో 85 మందిని పెద్దపల్లిలో జరుగుతున్న యువ వికాస సభకు పంపించామన్నారు. కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, మారుతి, పోషమల్లు, సాగర్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సంతో రైతులు ఆగమాగం

తాడ్వాయి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు ఆగమవుతూ భయాందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికివచ్చే సమయంలో అకాల వర్షాలు ఆగం చేస్తున్నాయని ఆవేదనతో కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇటీవల కోతకు వచ్చిన వరిపంటను యంత్రాల ద్వారా వడ్లు నూర్పి విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలించడంతో అకాలవర్షాలు ఆగం చేస్తుండడంతో ఏమి చేయాలో తోచక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యంరాశులు తడిసి ముద్దవుతున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాలల్లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష

కాటారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంపిక చేసిన పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)పరీక్ష బుధవారం నిర్వహించారు. కాటారం ఎస్టీ బాలుర,బాలికల గురుకుల విద్యాలయాలు, కేజీబీవీ, దామెరకుంట ఎస్సీ బాలికల గురుకులం, కాటారం, దామెరకుంట, దేవరాంపల్లి జడ్పీహెచ్ఎస్, ఎంపీఎస్‌లతో పాటు మండలకేంద్రంలోని ఆదర్శ, వివేకానంద, మాంటిస్సోరి, సువిద్య, కేంబ్రిడ్జి, విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్‌సీఈఆర్‌టీ(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్)ఆధ్వర్యంలో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు న్యాస్ పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాలను ఎంఈవో శ్రీదేవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

మల్హర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన యువ వికాసం కార్యక్రమానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. తాడిచర్ల, మల్లారం, చిన్నతూండ్ల, పెద్దతూండ్ల, కొయ్యూర్, వల్లెంకుంట, ఎడ్లపల్లితో పాటు పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, ఐత రాజిరెడ్డి, జంగిడి శ్రీనివాస్, జంగిడి సమ్మయ్య, రవి, సవేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు భయపడొద్దు : ఎస్సై



ప్రజలకు సూచనలు చేస్తున్న ఎస్సై శ్రీకాంత్ రెడ్డి

మేడారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూ ప్రకంపనలకు ఎవరూ భయపడవద్దని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం భూకంపం అనంతరం మండలంలోని నార్లాపూర్, కాల్వపల్లి, మేడారం, ఊరట్టం, వెంగళాపూర్, బయ్యక్కపేట గ్రామాల్లో పర్యటించారు. ప్రజలకు భూ ప్రకంపనలపై పలు సూచనలు చేశారు. గ్రామ పెద్దలతో మాట్లాడుతూ భూకంపం వలన సంభవించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భూమిలో మార్పుల వలన ప్రకంపనాలు వస్తుంటాయని అన్నారు. ఎవరికైనా సమస్యలు ఏర్పడితే పోలీసులకు తెలియజేయాలని గ్రామస్తులకు సూచించారు. అమ్మవార్ల దీవెనలతో ఎలాంటి ప్రమాదం జరగలేదని బావోద్వేగాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

- వారోత్సవాల్లో మావోయిస్టులు
- భగ్నం చేయడంలో పోలీసులు
- బందూకుల మధ్య బావురుమంటున్న పల్లె వాసులు



పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో ఏటూరునాగారం మండలంలో వాహనలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏటూరునాగారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) 24వ వారోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ములుగు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై అడవులను జల్లెడ పడుతోంది. ఈ వారోత్సవాల నేపథ్యంలోనే మండలంలోని చల్పాక అడవుల్లో మావోయిస్టులు తలదాచుకున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు గుర్తించి కాల్పులు జరపడంతో ఏడుగురు మావోయిస్టులు హతమైన విషయం తెలిసిందే. తమ అనుచరులను కోల్పోయిన మావోయిస్టులు ప్రతికార చర్యలకు పాల్పడుతారనే ఉద్దేశంతో పోలీసులు ముందస్తుగా వారోత్సవాలను భగ్నంచేసే దిశలో వందలాది మంది స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్, సివిల్, సీఆర్పీఎఫ్ బలగాలను దింపి చెట్టు పుట్ట గాలిస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా చల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కొంతమంది మావోయిస్టులు తప్పించుకొని, వారోత్సవాలనువిజయవంతం చేసేందుకు ఏటూరునాగారం అడవుల్లో తలదాచుకొని ఉంటారని పోలీసు యంత్రం భావిస్తుంది. ఎట్టకేలకు పోలీసుల కూబింగ్‌లతో ఏజెన్సీ పల్లెవాసులు ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. అంతేకాకుండా బుధవారం మండలకేంద్రంలోని వై-జంక్షన్ మూలమలుపు, బూర్గంపాడు-ఏటూరునాగారం జాతీయ రహదారిలో ముమ్మ రంగా వాహన తనిఖీలు చేపట్టారు. ములుగు ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ఏటూరునాగారం సీఐ అను ముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె.తాజుద్దీన్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. వాహనాల ధ్రువీకరణ ప్రతాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని వాహనదారులను హెచ్చరిస్తున్నారు. అతేకాకుండా మావోయిస్టులు సంచరించే స్థావరాలను గుర్తించేందుకు అడవులను జల్లెడ పడుతున్నారు. గొత్తికోయ గూడాలల్లో తనిఖీలను ముమ్మరం మావోయిస్టు వారోత్సవాలతో పాటు, సరిహద్దు ప్రాంతాల్లో వరుసగా ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో మావోయిస్టులు అడవుల్లోని గూడాల్లో తలదాచుకుంటున్నారనే సమాచారం మేరకు పోలీసులు ప్రత్యేక నిఘా సారించి తనిఖీలు చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. అంతేకాకుండా ఏటూరునాగారం నుంచి ఇతర ప్రాంతాలకు వచ్చిపోయే ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేసి అనుమానితులను అదుపులోని తీసుకొని విచారించి వదిలేస్తున్నట్లు సమాచారం.

క్రైం కార్నర్

పోలీసుల అదుపులో దొంగల ముఠా!

కాటారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరంపల్లి జీపీ పరిధిలో అనుమాల సత్యమ్మ ఇంట్లో జరిగిన చోరీ ఘటన దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి దొంగల ముఠాను పట్టుకున్నట్లు సమాచారం. ఎస్పీ కిరణ్‌ఖరే, డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాటారం సీఐ నాగార్జునరావు, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, కాటారం, మహాముత్తారం ఎస్సైలు అభినవ్, మహేందర్, సీసీఎస్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో 5 పోలీసు బృందాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో దొంగలను పట్టుకుని సొమ్మును రికవరీ చేసినట్లు తెలుస్తోంది. కాగా, దొంగల ముఠాలో ఒకరు అంతర్‌రాష్ట్ర దొంగ ఉన్నట్లు తెలుస్తోంది. శంకరంపల్లి జీపీ పరిధిలోని చోరీతో పాటు పలు ప్రాంతాల్లోనూ ఈ దొంగల ముఠా దొంగతనాలు చేసినట్లు సమాచారం. దొంగల ముఠా నుంచి భారీ ఎత్తునబంగారు ఆభరణాలు, వాహనాలు రికవరీ చేసినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో దొంగల ముఠా అరెస్టును చూపనున్నట్లు తెలుస్తోంది.

కూలీ ఆత్మహత్య



మొగుళ్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. మొగుళ్లపల్లికి చెందిన రావిచెట్టి మూగయ్య-లక్ష్మి దంపతుల కుమారుడు రాజు(28) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో నూతన గ్రామ పంచాయతీ భవనం వెనుక వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యచేసుకున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె(23 రోజులు) ఉంది. కాగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన

మంగపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రాహ్మణపల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రజిని ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, 18ఏళ్ల లోపు అమ్మాయిలకు వివాహం చేసినట్లయితే శారీరక, మానసిక హింసకు గురవుతారని రజిని అన్నారు. కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్ మౌనిక, ములుగు జిల్లా బాలల పరిరక్షణ సంఘం అవుట్‌రిచ్ వర్కర్ భూక్య రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

మహదేవపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మహదేవపూర్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలో ఉన్న ఫైల్స్, కేసుల పురోగతి విషయమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ రామచంద్రరావు, మహేదవపూర్ ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సీఆర్టీ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

- ఏఎస్‌యూ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన

మంగపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏటూరునాగారం ఐటీడీఏలో సీఆర్టీల నియామకాల జనరల్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివాసీ విద్యార్థి సంఘం(ఏఎస్‌యూ) మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి మాట్లాడుతూ ఐటీడీఏలో పనిచేస్తున్న డీడీ పోచం జారీ చేసిన సీఆర్టీ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. ఐటీడీఏ ద్వారా ప్రతి నోటిఫికేషన్ ఆదివాసీలతోనే భర్తీ చేయాలని, చాలా ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ రూల్ ఆఫ్ ది రిజర్వేషన్ ఐదవ షెడ్యూల్‌కు వ్యతిరేకంగా ఉందని అన్నారు. జీవో 57 ప్రకారం అర్హత కలిగిన ఆదివాసీ అభ్యర్థులతో మాత్రమే ఉద్యోగాలు భర్తీ చేయాలని, దీనికి విరుద్ధంగా వ్యవహరించిన పోచంపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక లక్ష్మణ్, తుడుందెబ్బ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్సం రమేష్, ఏఎస్‌యూ నాయకులు పి.నాగార్జున్, వంశీ, రాంబాబు, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

- కన్నాయిగూడెం: ఐటీడీఏ పరిధిలో ఇచ్చిన జనరల్ సీఆర్‌టీ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని తుడుందెబ్బ మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఆలం నగేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్ భూభాగానికి లోబడి ఆదివాసీ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఆదివాసీలనే సీఆర్‌టీలుగా నియమించాలన్నారు. జనరల్ నోటిఫికేషన్‌ను రద్దు చేసి గిరిజనుల కోసం ప్రత్యేక సీఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. సమావేశంలో పాపారావు, జంపయ్య, నాగబాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కొడిశాల ఆశ్రమ ఉన్నత పాఠశాల తనిఖీ

తాడ్వాయి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొడిశాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ముందుగా ఆయన పాఠశాలలోని వసతి గృహం, డైనింగ్ హాల్, వంటగది, స్టోర్‌రూంను పరిశీలించి వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన వేడి భోజనం అందించాలని, వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. నాణ్యమైన కూరగాయలు, వంట సరుకులు ఉపయోగించాలని అన్నారు. విద్యార్థులు ఎలాంటి జబ్బులబారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎన్ఎం సుధారాణికి సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు తోలెం దేవదాస్‌కు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చందా కోటేశ్వర్‌రావు, అజ్మీరా రవీందర్, ఆలం జగపతిరావు, దేవ్లా, ఆలెం అశోక్, మొగిలిపల్లి లక్ష్మయ్య, చేల కృష్ణయ్య, సోలం సాంబయ్య, జిగట భాస్కర్, స్పోర్ట్స్ ఆఫీసర్ యాలం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వరికోత యంత్రంలో షార్ట్‌సర్క్యూట్

- తప్పిన ప్రమాదం

చిట్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాపూర్ శివారులో వరికోత యంత్రం ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం మంటలు ఎగిసిపడ్డాయి. రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కనిపర్తి గ్రామానికి చెందిన పత్తి శ్రీనివాస్‌కు చెందిన వరికోత యంత్రం(హార్వెస్టర్) మండలంలోని కైలాపూర్ శివారులో పొలాల్లో వరిధాన్యం కోస్తుంది. యంత్రం ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో డ్రైవర్ రాజు యంత్రం పైనుంచి కిందకు దూకి పరుగులు తీశాడు. రైతుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని అందుబాటులో ఉన్న మోటారు, రైతుల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

మంత్రి సీతక్కకు రుణపడి ఉంటాం : కాంగ్రెస్

- మండల కేంద్రంలో బస్సు డిపో ఏర్పాటుపై సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



ఏటూరునాగారం బస్టాండ్‌లో సీఎం, మంత్రులు సీతక్క, ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు, గ్రామస్తులు

ఏటూరునాగారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కకు రుణపడి ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఏటూరునాగారంకు బస్సు డిపో మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సంబరాలు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పార్టీ నాయకులతో పాటు గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ.. ఏటూరునాగారం మండలానికి బస్సు డిపో మంజూరు చేయడం చాలా శుభపరిణామమని, ఏజెన్సీ ప్రజల రవాణా అవసరాలు తీర్చడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి దోహదం చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, ప్రభాకర్ ఏజెన్సీ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. మూడు రాష్ట్రాలకు సెంటర్‌గా ఉన్న ఏటూరునాగారం మండలానికి డిపో ఏర్పాటు చేయడం ఒక కీలకమైన మైలురాయి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, యువజన నాయకులు, మహిళా నాయకురాలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటూరునాగారానికి బస్సు డిపో

(5వ పేజీ తరువాయి)

చేసినట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడింస్తున్నారు. అయితే ముందుగా కనీసం 20 నుంచి 25 బస్సులతో డిపో ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఈనెల ఆఖరిలోగా మంత్రి సీతక్క బస్సు డిపో పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో డిపో పనులు కూడా ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. సుమారు 25 ఏళ్ల క్రితం ఏటూరునాగారంలోని ఆకులవారిఘణపురంలో పంచాయతీరాజ్ కార్యాలయం పక్కనే ఉన్న సుమారు 4 ఎకరాల సలాన్ని కూడా కేటాయించారు. అంతకుముందు ఇక్కడ బస్‌స్టేషన్ నిర్మాణం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి సీతక్క హయాంలోనే బస్సు డిపోకు మోక్షం లభించింది. కాగా, బస్సు ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది.

ఏజెన్సీ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది..

- మంత్రి ధనసరి సీతక్క

మూడు రాష్ట్రాలకు కేంద్రంగా ఉన్న ఏటూరునాగారానికి బస్సు డిపో మంజూరు కావడంతో ఏజెన్సీ ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. ప్రయాణీకులకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచటమే కాకుండా ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఈ నిర్ణయంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేస్తూ డిపో అందుబాటుకి రావడం పట్ల ఏజెన్సీ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

మంత్రులు పొన్నం, శ్రీనివాస్‌రెడ్డికి సీతక్క సన్మానం



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న సీతక్క

ములుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క బుధవారం సన్మానించారు. ఏటూరునాగారానికి బస్సు డిపో మంజూరు చేయడం, ములుగు మండలంలోని మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేయడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటానని, జిల్లావాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అభివృద్ధితో దూరం చేస్తానన్నారు. తన సంకల్పానికి సహకారమందిస్తున్న సహచర మంత్రులకు సీతక్క ధన్యవాదాలు తెలిపారు. సీతక్క వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఉన్నారు.

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కళాశాల ఆవరణలో బాలురకు క్రీడలు, సాహిత్య కార్యక్రమాలు, బాలికలకు పరుగుపందెం, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్, వక్తృత్వ పోటీలు బుధవారం నిర్వహించారు.ఈసందర్భంగా జరిగిన సమావేశంలో మల్లేశం పాల్గొని మాట్లాడారు. క్రీడలు శారీరక వికాసంతోపాటు మానసిక వికాసానికి తోడ్పడి ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తి కనబర్చాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జె.శంకర్, ఎం.అనిల్‌కుమార్, కె.సరిత, పి.ఉదయశ్రీ, పి.విజిత, తేజోలత, రమేష్, మౌలానా, టి.అనిత, శ్రీను, కె.లక్ష్మి, షరీఫా, ఐలయ్య, ఎస్.రమేష్, రాంచందర్, మహేందర్, పరమేష్, కవిత పాల్గొన్నారు.

రామప్ప ఆలయంలో ఘనంగా మహారుద్రయాగం

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో బుధవారం దేవాదాయ-ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో మహారుద్రయాగం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా అర్చకులు పండిత,పామరుల సమక్షంలో వేదమంత్రాలు పఠిస్తూ అంగరంగ వైభవంగా రుద్రేశ్వరుడి నామం జపిస్తూ హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని హోమగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి రుద్రేశ్వరుడికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి ఐలయ్య, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపిడి శ్రీనివాసరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టెకోళ్ల వెంకటేష్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మైస ప్రభాకర్, నాయకులు తోట భద్రయ్య, చెన్నోజు శ్రీనివాస్, మూడెడ్ల రాజేందర్, కొండ తిరుపతి, మామిండ్ల రాజు, బోడ రాములు, ఎమ్డీ.ఖబీర్, తడండ్ల గోపాల్, జిట్టబోయిన దేవేందర్, వడ్డెపల్లి శంకర్, వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ ఉత్సవ కమిటీ ఎన్నిక



ఎన్నికైన మహా పడిపూజ ఉత్సవ కమిటీ సభ్యులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కేంద్రంలో రామాలయం ఆవరణలో అయ్యప్ప భక్తమండలి ఆధ్వర్యంలో ఈనెల 16వతేదీన మహాపడిపూజ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు బుధవారం జరిగిన సమావేశంలో అయ్యప్ప మహాపడిపూజ ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా భూక్య రమేష్, ఉపాధ్యక్షులుగా పొడాల ఓంప్రకాష్, కోయిల కవిరాజ్, వంగర పాపారావు, ప్రధాన కార్యదర్శులుగా శీలమంతుల విఘ్నేశ్వరచారి, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి, కోశాధికారులుగా సానికొమ్ము శ్రీనాథ్ రెడ్డి, సదానందం, కార్యదర్శులుగా కొత్త సురేందర్, బాణాల రాజ్‌కుమార్, ఆడెపు రాజు, ఒజ్జల కుమార్, మాదరి వంశీ, గొట్టెముక్కల తిరుపతి, ప్రచార కార్యదర్శులుగా సంగ రంజిత్, కొండి రవీందర్, కంచర్ల రాజు, పేరబోయిన విజయ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా అన్నదాన ఇన్‌చార్జిలుగా బత్తుల సురేందర్, రుద్రారపు నరేష్, చిట్యాల మహేష్, పరికిరాల రాజేష్, పైనాల ప్రణయ్, క్రాంతి, అనిశెట్టి పవన్, నగర సంకీర్తన కలశముల ఇన్‌చార్జిలుగా గోరంట్ల శ్రీనివాస్, లింగాల శ్రీను, పిట్టల భద్రయ్య, కాసర్ల సంతోష్ ఎన్నికయ్యారు. కాగా, మహాపడిపూజ కార్యక్రమకర్తగా వ్యవహరించడానికి జరిగిన వేలాన్ని స్థానిక వ్యాపారి పైడిమల్ల గోపీకృష్ణ కైవసం చేసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని, లెప్రసీ, పల్స్‌పోలియో, టీబీ బకాయి పారితోషికాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో సమ్మె సందర్భంగా కమిషనర్‌తో జరిగిన చర్చల హామీలు, ప్రమాద బీమా రూ.50 లక్షలకు జీవో ఇవ్వాలని, ఎన్నికల డ్యూటీ, మేడారం జాతర డ్యూటీ డబ్బులు చెల్లించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ దివాకరకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గుండెబోయిన రవిగౌడ్, ఆశాల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, జిల్లా నాయకురాళ్లు ప్రభావతి, నాగమణి, శ్రావ్య, సరిత, సత్యవతి, దేవి, రాజ్యలక్ష్మి, సుధ, చంద్రకళ, సరోజన, సంధ్య, రజిత, పెద్దసంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.